విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 8, జూన్ 2024

రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలి

- లాభదాయకమైన అంతర పంటలను రైతులకు సిఫార్సు చేయాలి
- కే-6, గిరినార్ 4,5 విత్తన రకాలపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం: రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలని వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ వి.కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాయితీపై అంతర పంటల విత్తనాలు పంపిణీకి సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, డివిజన్ స్థాయి, మండల స్థాయి వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేరుశనగ విత్తన పంపిణీకి సంబంధించిన ఏదైనా సమస్యలు ఉన్నాయా అని క్షేత్ర సాయి సిబ్బందిని ఆరా తీశారు. వేరుశనగతో పాటు అంతర పంటలు కూడా సాగు చేస్తారు కాబట్టి ఆ విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి.. అవసరమైన విత్తనాలతో పాటు పచ్చి రొట్టె పైరులుకి సంబంధిం చిన విత్తనాలను పంపిణీ చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో రైతులకు లాభదాయకమైన అంతర పంటలను శాస్త్రవేత్తల ద్వారా సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో రైతు శిక్షణ కేంద్రం ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బందిని, రైతులకు కొత్త అంశాలపై శిక్షణ ఇచ్చే విధంగా షెడ్యూలు తయారు చేసి వాటిని అమలు చేయాలన్నారు. అలాగే ఇతర జిల్లాలలో, రాష్ట్రాల్లో ఉన్న శిక్షణ కేంద్రాలకు కూడా పంపించి ఎప్పటికప్పుడు కొత్త అంశాలను క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొత్త రకాలకు సంబంధించిన విత్తన రకాలను వ్యవసాయ పరిశోధన స్థానం, రేకులకుంట, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కే-6 రకంతో పాటు గుజరాత్ సంబంధించిన గిరినార్ 4, 5 వంటి రకాలు కూడా మంచి దిగుబడి వస్తుందిని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ జిల్లాలో వేరుశెనగ విత్తన పంపిణీకి సంబంధించిన అంశాలను, అంతర పంట విత్తనాల కేటాయింపులు పచ్చి రొట్టె పైర్ల సంబంధించిన విత్తనాల పంపిణీ సంబంధించి వివరాలు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ పరిశోధన స్థానం రేకుల కుంట, కదిరి శాస్త్రవేత్తలు, డివిజన్ స్థాయి సహాయ వ్యవసాయ సంచాలకులు మండల స్థాయివ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలన

జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలిస్తున్న కలెక్టర్ ..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్. ఇరిగేషన్ అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. శుక్రవారం జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ సిస్టంలోని అంతర్భాగమైన జీడిపల్లి రిజర్వాయర్‌ను కళ్యాణదుర్గం ఆర్డీవో రాణి సుస్మిత, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశే నాయక్‌లతో కలిసి రిజర్వాయర్‌ను పరిశీలించి పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసు కున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్ బండ్‌పై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్.అండ్.ఆర్ ప్యాకేజిని వన్ టైం సెటిల్మెంట్ కింద మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా వివరాలు ఆరా తీశారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలు కావడంతో హెచ్ఎల్సి, హెచ్ఎన్ఎస్ఎస్ కింద రాబోయే జూలై, ఆగస్టు, మార్చిలో నీటి విడుదల ప్రక్రియపై పరిశీలన చేయడం కోసం రిజర్వాయర్‌ను తనిఖీ చేశామన్నారు. రిజర్వాయర్ లో ప్రస్తుతం 0.3 టిఎంసిల నీటి నిల్వ ఉండగా, ప్రస్తుతం స్థానికంగా 150 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. జిల్లాలో మే లో వర్షం అధికంగా వచ్చిందని, ఈ నెలలో కూడా ఎక్కువ వర్షపాతం వచ్చే అవకాశాలు ఉన్నాయయన్నారు. రిజర్వాయర్ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో, నీటి విడుదలపై హెచ్ఎన్ఎస్ ఎస్ ఏఈలు, డీఈలు, ఈఈలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బండ్ అలైన్మెంట్, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో రెగ్యులేటర్, పంప్ హౌస్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ ఎస్ఈఈ శ్రీనివాస నాయక్, డీఈలు వెంకటేశ్వర్లు, విశ్వనాథ రెడ్డి, జెఈ కలందర్, ఏఈఈలు నాగస్వాతి, షఫ్రుద్దీన్, ఎంపీడీవో సుబ్బరాజు, డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరా పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు సేవకులుగా పనిచేయాలి

విశాలాంధ్ర-బెలుగుప్ప : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, సేవకులుగా పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం బెలుగుప్ప ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. జీడిపల్లి రిజర్వాయరును పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించిన ఏ ఒక్క అధికారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి...

- గుంతల్లో నీటి నిల్వలను తొలగించండి
- దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టండి
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- డీఎంహెచ్ఓ డా.ఈబి దేవి

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నందు జిల్లా అధికారి డాక్టర్ ఈబి దేవి అధ్యక్షతన మలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా జూన్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగబోవు మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాస్థాయి ప్రణాళిక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడటంతో మలేరియాకు కారణమైన దోమలు పెరుగుదలను అరికట్టడంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖతో పాటు వివిధ లైన్ డిపార్ట్మెంట్స్ అయిన పంచాయతీరాజ్ శాఖ,,మున్సిపాల్ శాఖ, విద్యాశాఖ, మైన్స్ శాఖ, మత్స్య శాఖ, మొదలగు శాఖలతో సమన్వయం చేసుకొని దోమలు పెరిగేందుకు కారణమైన నీటి నిల్వలను నిర్మూలించాలని, నీటి నిల్వ ఉన్నచోట అబేట్ మందును పిచికారీ చేయాలన్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు సూచించడం జరిగింది. ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఆ ప్రాంతం నందు మలేరియా కేసు వచ్చినచో ప్రత్యేక దృష్టిని ఉంచి ఆ ప్రాంతంలో మలాథియన్ మరియు పైరత్నం స్ప్రే చేయాలని ఆ ప్రాంతం నందు ఫీవర్ సర్వే తో పాటు జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తి యొక్క రక్త పూతలు సేకరించాలని మలేరియా నిర్ధారణ చేయాలని తీర్మానించారు. మలేరియా అని నిర్ధారించినచో పూర్తిస్థాయిలోచికిత్స అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రేయ్ డే కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వలు లేకుండా చూడాలని లార్వాను నిర్మూలించాలన్నారు. జూన్ మాసమంతా మలేరియా మీద ప్రజలకు అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డా పాల్ రవికుమార్ డిసిహెచ్ఎస్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భీమసేన చారి, జిల్లా మలేరియా అధికారి ఓబులు ,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత ,డా రవిశంకర్, ఎంపీహెచ్వో గిరిధర్ రెడ్డి, డెమో ఉమాపతి ఉప డెమో త్యాగరాజ్, గంగాధర్ పాల్గొన్నారు.

యువత సమాజ సేవకు ఆసక్తి చూపాలి....

- శ్రీరామ్ ఫౌండేషన్ అనూష

విశాలాంధ్ర-రాయదుర్గం: సమాజ సేవకు యువత ఆసక్తి చూపాలని సమాజ సేవలకు లక్ష్యంగా తన తండ్రిగారి జ్ఞాపకార్థంగా శ్రీరామ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించామని, ఎన్నో సేవ పురస్కారాలు పొందామని అనుష పేర్కొన్నారు. నిరుపేదలకు అన్నదానం, రక్తదానం, వస్త్రాధానం, ఒంటరి వృద్ధులకు, వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమాలు, చిన్నపిల్లల ఆశ్రమాల్లో, మానసిక వికలాంగుల ఆశ్రమాలలో ప్రభుత్వ అస్పత్రిలో అన్నదానం రోగులకు పౌష్టికరమైన పండ్లు అందిస్తూ నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ మానసిక వికలాంగుల ఆశ్రమాలలో స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ, అభాగ్యులకు చీరలు దుప్పట్లు పంపిణీ రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, సదస్సులు మొక్కల పంపిణీ ఇలాంటి మరెన్నో సేవలందిస్తున్నామన్నారు. ఈ సమాజ సేవలో భాగ్యసామలు కావాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం రాయదుర్గం పరిసర ప్రాంతంలో దేవాలయం వద్ద రైల్వే స్టేషన్ల వద్ద ఒక్క పూట ఆహారం కోసం ఎదురు చూస్తున్నవారికి కడుపు నింపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని యువత ఇలాంటి మరెన్నో సమాజ సేవలుకు నడుంబిగించాలని పిలుపునిచ్చారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో బహుమతుల ప్రదానం..



విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) ముగింపు సమావేశం, బహుమతుల ప్రదాన కార్యక్ర మాన్ని గ్రంథాలయ అధికారిని హెచ్. ఉషారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాలేజ్ లెక్చరర్లు రేణుక దేవి, సావిత్రిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానం, విలువలు ఉన్న దేవాలయాలని, విద్యార్థి విద్యార్థులకు చిన్నతనం నుంచి గ్రంథాలయానికి వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలు చదివి జ్ఞానం సంపాదించుకోవాలని సూచించారు. ఉన్నతంగా ఎదగడానికి పుస్తకాలు తోడ్పడతాయని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాల బాలికలు, పాఠకులు, రేణుకాదేవి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు ముగింపు

బహుమతులు ప్రదానం చేసిన లైబ్రేరియన్

విద్యార్థులకు బహుమతి అందిస్తున్న లైబ్రేరియన్ కృష్ణ

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మే 15వ తేదీ నుండి జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఏఎస్ఐ చిత్తంబరం, శాఖా గ్రంథాలయాధికారి జి.కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠవా శక్తి ని పెంచుకోవాలని, గ్రంథాలయాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న 30మంది విద్యార్థినీ విద్యార్థులకు శాఖ గ్రంథాలయాధికారి జి,కృష్ణ బహుమతులు అందజేశారు. పాఠకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో వైసీపీ కార్యకర్తలను ఏ రోజైనా పట్టించుకున్నావా..?

-మీరు ఐదేళ్ళలో ఏం చేశారు.. మాకు ఆర్నెళ్ళుటైం ఇవ్వడమేంటి..?
-మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యలపై రాప్తాడు నేతల ఆగ్రహం

విశాలాంధ్ర-రాప్తాడు: వైసీపీ ఐదేళ్లు అధికారంలో ఉండి ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ఏం చేశారని... మా టీడీపీ ప్రభుత్వం ఇంకా ఏర్పడకముందే.. మాకు ఆర్నెళ్ల సమయం ఇవ్వడమేంటని.. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై రాప్తాడు నియోజకవర్గ టీడీపీ మండల కన్వీనర్లు పంపు కొండప్ప, యాతం పోతులయ్య, ముత్యాలరెడ్డి, దాసరి సుధాకర్, ముట్టాల శీనా, జింకా సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వారు రాప్తాడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇప్పుడు వైసీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని మాట్లాడుతున్నారు.. అసలు 2019లో మీరు గెలిచిన తర్వాత ఏం చేశారో ఒకసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. గ్రామాల్లో అన్ని విధాలా విధ్వంసం సృష్టించిన సంగతి మర్చిపోయారా అని నిలదీశారు. గ్రామాల్లో టీడీపీ సానుభూతిపరులు, వందల మందిపై దాడులు మరచిపోయారా అన్నారు. ఆ రోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. కోర్టు మెట్లు ఎక్కినా మీరు దాడులు ఆపారా అని ప్రశ్నించారు. ఇవాళ అక్కడక్కడ జరుగుతున్న సంఘటనలను మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మకు ఆపాదించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు నుంచి నేటి వరకు శాంతియుతంగా ఉండాలని పరిటాల సునీత చెబుతున్నారని... ఇలా మీరు గత ఐదేళ్లలో ఏరోజైనా చెప్పకపోగా, వ్యవస్థల్ని అడ్డుపెట్టుకుని మీరు చేసినవి ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. ఏ రోజైనా మీ కార్యకర్తలని పట్టించుకున్నావా అని... మేమింకా ప్రమాణ స్వీకారం చేయకముందే విమర్శించడం తగదన్నారు. టీడీపీ హయాంలోనే మంజూరైన పనులు కూడా చేయలేని దద్దమ్మలు మీరని విమర్శించారు. కనీసం సొంత గ్రామానికి రోడ్డు వేసుకోలేకపోయావని.. నువ్వా అభివృద్ధి గురించి మాట్లాడేది అన్నారు. జగన్ రెడ్డితో పాటు నీలాంటి ఎమ్మెల్యేలంతా కలసి రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా చేశారన్నారు. మీరు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని.. కచ్చితంగా మేము ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. మీరు మీ సోదరులు గతంలోలా ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ముందు మీరు ఎందుకు ఓడిపోయారో కారణాలు తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో మా కార్యకర్తలు కూడా సంయమనంతో ఉండాలని కోరారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

తహసిల్దార్‌కు జనసేన నాయకుల ఫిర్యాదు

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్లలోని మండల కాంప్లెక్స్ వెనుక ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిలో ఇటీవల కాలంలో నకిలీ పట్టాలు సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వాటిపై వెంటనే రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు శుక్రవారం తహసిల్దార్ అక్బల్ భాషకు వినతి పత్రం అందజేశారు, సర్వే నెంబర్ 272-2,4లో కొంతమంది నకిలీ పట్టాలను తయారు చేసే విక్రయిస్తున్నారని అక్రమ నిర్మాణాలు కూడా రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వెంటనే అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జి సురేష్ కుమార్ ,రాఘవేంద్ర, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, తిరుపాల్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిని నిర్మూలిద్దాం

విశాలాంధ్ర-శెట్టూరు : జాతీయ మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలో చిన్నంపల్లి గ్రామంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి తిరుపాలయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దోమ పుట్టరాదు - దోమ కుట్టరాదు, దోమలపై యుద్ధం మన జీవితాలకు భద్రం , వేపాకు పొగ - దోమలకు సెగ, దోమకాటు - ఆరోగ్యానికి చేటు అని వీధుల్లో నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం ఆర్డీటీ స్కూల్ లో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని , సాయంత్రం పూట వేపాకు పొగ వేసుకోవాలని , దోమతెరలు వాడాలని సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలో కొన్ని ఇళ్ళల్లో తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి లార్వాలను నిర్మూలించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించేటప్పుడు జ్వరం కేసులు ఏమైనా ఉన్నాయా లేదా అని ప్రతి ఇంటింటికీ వెళ్లి అడగాలని జ్వరం వచ్చిన వారికి రక్త పూత తీసి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నరేష్, హెల్త్ అసిస్టెంట్ జాన్ సన్, ఎంఎల్.హెచ్ పీ శిరీష, సచివాలయ ఏఎన్ ఎమ్ చిట్టెమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో రాప్తాడు ప్రజలకు శుద్ధజలం

విశాలాంధ్ర-రాప్తాడు: త్వరలో రాప్తాడు గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందుబాటులో ఉంచుతామని టీడీపీ మండల ఇంచార్జి ధర్మవరపు మురళీ తెలిపారు. ఐదేళ్లుగా గ్రామంలో మూతపడిన శుద్ధజల కేంద్రాన్ని శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. తక్కువ ధరతో మంచినీటిని అందించడానికి తగిన చర్యలు చేపడతామన్నారు. ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు వ్యాధులు బారినపడే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు, మాజీ కన్వీనర్ సాకే నారాయణస్వామి, గంగలకుంట కిష్ట, సాకే జయరాముడు, జూటూరు రామకృష్ణ, గోనిపట్ల శీన, రాజశేఖర్‌రెడ్డి, మూలింటి బీరన్న తదితరులు ఉన్నారు.

ఎంపీ అంబికాలక్ష్మీనారాయణకు టీడీపీ నాయకుల శుభాకాంక్షలు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-శింగనమల: అనంతపురం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అంబికా లక్ష్మీనారాయణ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్,పెద్దనాగముని చినరాయుడు, రాజబాబు, ప్రకాష్ శుక్రవారం పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తిరిగి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం శుభ పరిణామమని, ఇది తెలుగు ప్రజల విజయమని పేర్కొన్నారు. అదేవిధంగా శింగనమల ఎమ్మెల్యేగా బండారు శ్రావణి శ్రీ విజయం సాధించడం ఎమ్మెల్యేగా ఎంపీగా ఇద్దరు గెలవడం శింగనమల నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటును అందించడం నియోజకవర్గ ప్రజలందరికీ గ్రామాల అభివృద్ధికి పునాదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను అభినందించిన నల్లాని రాజేశ్వరి

విశాలాంధ్ర-జేఎన్టీయూపి : టీడీపీ కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్యే నారా లోకేష్ ను ప్రముఖ విద్యావేత్త, కాలమిస్ట్, సామాజిక కార్యకర్త, ఎస్.ఆర్.ఐ. ఫౌండేషన్ ఛైర్ పర్సన్ నల్లాని రాజేశ్వరి ప్రత్యేకంగా అభినందించారు. మంగళగిరి శాసనసభ్యునిగా 91 వేలకు పైగా మెజారిటీ రావడం పట్ల రాజేశ్వరి హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం ఉండవల్లి లోని క్యాంప్ ఆఫీసులో లోకేష్ ను కలిసిన ఆమె ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కూడా ఇవ్వడంతో లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.ఐ. ఫౌండేషన్ సిఇఓ గుత్తా హరి పాల్గొన్నారు.

ఉద్యోగరీత్యా ప్రజలకు చేసిన సేవలే శాశ్వతం

-తహశీల్దార్ టి.సీతారాం

పదవీ విరమణ పొందిన యాదవల్లి సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

విశాలాంధ్ర-రాప్తాడు: ఉద్యోగరీత్యా ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేసిన సేవలే శాశ్వతమని తహశీల్దార్ టి. సీతారాం అన్నారు. 30ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో వీఆర్ఓగా పనిచేసి ప్రస్తుతం రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు గ్రామాల్లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన యాదవల్లి సుబ్రహ్మణ్యంకు శుక్రవారం రాప్తాడు తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదని ఏ ప్రభుత్వ ఉద్యోగి అయిన ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ ఉద్యోగరీత్యా నడుచుకోవాలన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.

అంతర పంటగా కంది సాగు చేయండి..

ఏవో అన్వేష్ కుమార్

విశాలాంధ్ర-శింగనమల: మండలంలోని రైతులు అంతర పంటగా కంది సాగు చేయాలని ఏవో అన్వేష్ కుమార్ ఏవో అన్వేష్ కుమార్ అన్నారు. శింగనమలం మండల వ్యవసాయ శాఖలో రాయితీ కందులు 4 కేజీల ధర రూ.392 లకు అందిస్తున్నామన్నారు. కంది సాగు చేయు రైతులు సోమవారం నుండి రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. , మండలం 2000(2020 మంది రైతులు) క్వింటాల్ కె 6 రకం, 70 క్వింటాళ్లు లేపాక్షి రకం(79 మంది రైతులు) రాయితీ వేరుశనగ పంపిణీ చేశామని తెలిపారు. అంతర పంటగా కందిని సాగు చేయడం వల్ల రైతులకు మంచి ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 8, జూన్ 2024

సుద్దుకంటపల్లి తండాలో గెలుపు సంబరాలే

- ఎన్నికల నేపథ్యంలో వేట గొడవళ్లతో వీరంగం సృష్టించారనడం అసత్య ప్రచారం
- ఎన్నికల నిబంధన ప్రకారం కేసు నమోదు.. ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : రామగిరి మండలం సుద్దుకుంటపల్లి తండాలో వేట కొడవళ్లు పట్టుకొని వీరంగం సృష్టిస్తున్నారంటూ ఓ న్యూస్ ఛానెల్లో వచ్చిన కథనంలో ఎటువంటి వాస్తవం లేదని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్పీ మాట్లాడుతూ దీనిపై పోలీసు శాఖ వెంటనే విచారణ చేపట్టిందన్నారు. రామగిరి మండలం సుద్దగుంటపల్లి తాండ గ్రామంలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఫలితాల అనంతరం తమ పార్టీ అభ్యర్థి గెలుపొందడంతో శుద్ద కుంటపల్లి తాండ గ్రామంలో ఆ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు, ఆనందంలో సంబరాలు చేసుకున్నారే తప్ప, ఎవ్వరినీ భయభ్రాంతులకు గురి చేయలేదన్నారు. ఈ సందర్భంగా పొట్టేలును కోసుకునే సందర్భంలో మచ్చు కత్తులు పట్టుకున్నారే తప్ప వీరంగం సృష్టించే ఉద్దేశం లేదని పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ వెల్లడించారు... దానిని వక్రీకరించి ప్రత్యర్థులను బెదిరించడానికి, గ్రామంలో భయానక వాతావరణం సృష్టించడానికి వేట కొడవళ్లతో వీరంగం చేశారని ఓ న్యూస్ ఛానల్లో వచ్చిన ప్రచారంపై వెంటనే విచారణ చేపట్టాలని ఎస్పీ రామగిరి పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు విచారణ జరిపిన పోలీసులు కేవలం తమ పార్టీ అభ్యర్థి గెలవడంతో సుద్దుకుంటపల్లి తండాలో ఆ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు కలిసి సంబరాలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఓ న్యూస్ ఛానల్, సోషల్ మీడియాలో ప్రసారమైనది పూర్తిగా అవాస్తవమని ఎస్పీ స్పష్టం చేశారు. ఆరోజు జరిగిన సంబరాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని తెలిపారు. కౌంటింగ్ అనంతరం జిల్లావ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ అన్ని భద్రతా చర్యలు చేపట్టిందని తెలిపారు.

మాజీ వీసీ వాహనాల దుర్వినియోగ ఖర్చు రికవరీపై అధికారుల నిర్లక్ష్యం...

నోటీసులు పంపని రిజిస్ట్రార్..
ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయి స్వామి..

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సులర్‌గా పనిచేసిన రాజ గోపాల్, ఎం.రామ కృష్ణారెడ్డి వ్యక్తిగత ప్రయాణాలకు యూనివర్సిటీ వాహనాన్ని వాడుకున్న డీజిల్ ఖర్చయిన డబ్బును రికవరీ చేయాలని శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ హుస్సేన్ రెడ్డి , రిజిస్ట్రార్ లక్ష్మీయ్యకు వినతి పత్రాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో వాహనాల వినియోగంపై గతనెల 17వ తేదీ ఆధారా లతో సహా అందజేసిన నేటికీ యూనివర్సిటీ అధికారులు నోటీసులు జారీ చేయలేదు. యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్‌గా తామ విధులు నిర్వర్తి స్తున్న సమయంలో వైస్ ఛాన్సులర్ వెహికల్ రామకృష్ణారెడ్డి, రెక్టార్, రిజిస్ట్రార్ వాహనాలను కుటుంబ సభ్యులు, వ్యక్తిగత ప్రయాణాలు, విహార యాత్రలు తిరగడానికి, కుమారుడి పెళ్లికి యూనివర్సిటీ వాహనాలను విశ్వవిద్యాలయ ధనాన్ని వృధా చేశారన్నారు. బకాయిపడిన సొమ్మును చెల్లించకుండా పదవీ విరమణ చేశారన్నారు. తక్షణమే యూనివర్సిటీ అధికారులు స్పందించి మాజీ వైస్ ఛాన్సులర్లతో వాడుకున్న డబ్బులను తక్షణమే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.. విద్యార్థులు హాస్టల్ మెస్ బిల్లులు ట్యూషన్ ఫీజులు చెల్లించకపోతే యూనివర్సిటీ అధికారులు కనీసం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధించిన కాలాలు ఉన్నాయన్నారు. విద్యార్థులను వేధిస్తున్నారు. కానీ అక్రమ పద్ధతుల్లో యూనివర్సిటీ డబ్బులను దోచుకుంటున్న మాజీ వైస్‌ఛాన్సులర్‌పై చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేయడం దేనికి సంకేతం అన్నారు. విజిలెన్స్ కమిటీ వేసి ఎంక్వయిరీ చేయా లన్నారు. వైస్ ఛాన్సులర్ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. సాయంత్రంలోగా నోటీసులు పంపుతా మని చెప్పడంతో విద్యార్థి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి కింద నీటి తొలగింపు

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 6వ తేదీన గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి "అండర్ బ్రిడ్జిలో నీటిని తొలగించండి..." అన్న కథనం విశాలాంధ్రలో ప్రచురితమైంది. ఈ సమస్యను ఆర్ అండ్‌బీ రైల్వే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగింది. దీంతో అధికారులు శుక్రవారం హుటాహుటిన నీటిని పంపు ద్వారా తొలగించారు. దీంతో కొత్తపేట నుంచి వచ్చే వాహనాలకు, బాటసారులకు, పుట్టపర్తికి వెళ్లే ఆర్టీసీ బస్సులకు ప్రయాణం సులభతరమైంది. అనంతరం ప్రజలు అధికారులు చేపట్టిన సమస్యకు పరిష్కారం ఇవ్వడం పట్ల హర్షం, కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

డిపోను అభివృద్ధి బాటలో నడిపేందుకు అందరి కృషి అవసరం...

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం ఆర్టీసీ డిపోను లాభాల బాటలో నడుపుతూ అభివృద్ధి దిశగా పయనింప చేసేలా అందరూ కృషి చేయాలని కడప-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆకస్మికంగా ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ముందుగా డిపో క్యారేజీ ట్రాఫిక్కు తదుపరి ఆర్టీసీ కార్గోను వారు పరిశీలించారు. గతంలో ఏపీలో ధర్మారం ఆర్టీసీ కార్గో ప్రథమ స్థానంలో ఉండటం పట్ల సిబ్బందిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిపో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, గ్యారేజీ కార్మికులకు బస్సు కండిషన్స్‌ను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా చెక్ చేసుకోవాలని తెలిపారు. తదుపరి డిపో ఆవరణములు వారు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. తదుపరి ప్రతిభ కనపరిచిన ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను వారి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ మధుసూదన్ డిపో మేనేజర్ సత్యనారాయణ రావు, యూనియన్ నాయకులు, ఆర్టీసీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్

విశాలాంధ్ర-కదిరి: పట్టణంలో నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండల విద్యాధికారి చెన్న కృష్ణ వినతిపత్రం అందచేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్ళజోడు పవన్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర మాట్లాడుతూ జీవో నెంబర్ 1,42 ప్రతి పాఠశాలలో అమలుకు చర్యలు చేపట్టాలని, విద్య పేరుతో కోట్ల వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు విద్య హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న కార్పొరేట్ కాసులకు విద్యాశాఖ అధికారులు అమ్ముడుపోతు విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు అనుమతి లేకుండా అక్రమ అడ్మిషన్ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యాసంస్థలు పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలు అమ్మకానికి పెట్టి,విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్స్ ఫుల్ అయ్యాయని చెప్పడం,ఫీజు నియంత్రణ చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు.

ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు పెంచాలంటే డిస్టిక్ ఫీ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలి కానీ ఇష్టాను సారంగారు రూ.5000 నుండి రూ.2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యూనిఫామ్స్, బుక్స్,ఇతర మెటీరియల్స్ విద్యాసంస్థలోనే అమ్మకానికి పెట్టిన పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు మాములు మత్తులో జోగుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ నాయకులు సాయి, విజయ్, రాము పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన వేరుశెనగ విత్తనాలు సరఫరా చేయండి

- విత్తన కాయల నాణ్యత విషయంలో రాజీ పడొద్దు
- విత్తన సాగుకు ఇదే మంచి సమయం
- రైతు సంక్షేమమే చంద్రన్న ప్రభుత్వ ధ్యేయం
- వ్యవసాయ అధికారులకు సూచించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను అర్హులైన రైతులందరికి సరఫరా చేయాలని పుట్టపర్తి నియోజకవర్గం నూతన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వ్యవసాయ అధికారులకు సూచించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రైతులకు పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగ కాయల సరఫరాపై ఆమె శుక్రవారం విజయవాడ నుంచి వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విత్తన కాయల సరఫరాపై ఈ సందర్భంగా నూతన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ,పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 19045 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో అమడ గూరు మండలానికి 3864 క్వింటాళ్లు,ఓడి చెరువు మండలానికి 4,567 క్వింటాళ్లు, నల్లమాడ మండలానికి 5,089 క్వింటాళ్లు, బుక్కపట్నం మండలానికి 1,483 క్వింటాళ్లు, కొత్తచెరువు మండలానికి 1576 క్వింటాళ్లు, పుట్టపర్తి మండలానికి 1,776 క్వింటాళ్లు, కేటాయింపు చేసినట్లు తెలిపారు. ఓడి చెరువు మండలంలోని తంగేడు కుంట పంచాయతీలోని శోత్రియం భూముల రైతులకు అదనంగా 690 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు కేటాయింపు చేసినట్లు వెల్లడించారు. శోత్రియం భూములు కలిగిన రైతులు ఇప్పటికే పట్టాదార్ పాస్ పుస్తకం కలిగి ఉండి వ్యవసాయ ప్రభుత్వ యాప్ లో ఆర్బీకే కేంద్రాల్లో ఇప్పటికే విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ విత్తన వేరుశనక్కాయలు ఇప్పటికే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు .ఇంకా పట్టాదార్ పాస్ పుస్తకం లేని అలాంటి రైతులకు ఆఫ్ లైన్ ద్వారా అధికారులు నమోదు చేసుకొని ఆ రైతులందరికీ విత్తన వేరుశెనక్కాయలు పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి భరోసా ఇచ్చారు. విత్తన కాయలు లేవని రైతులెవరూ అధైర్యపడవద్దని ప్రతిఒక్కరికీ అందించే బాధ్యత తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు ఎప్పుడూ అండగా ఉంటారని రైతులకు భరోసా ఇచ్చారు. జిల్లాలో తొలకరి వర్షాలు బాగా కురుస్తున్నాయని వ్యవసాయ పంటలు సాగు చేయడానికి ఇదే మంచి సమయమని సూచించారు. ప్రతి రైతు సకాలంలో పంటలు సాగు చేసుకొనేలా సిద్ధం కావాలని జిల్లా రైతాంగానికి పిలుపునిచ్చారు.

ఐక్యమత్యంతోనే సమస్యలు పరిష్కారం

బీసీ సంఘాల నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: బీసీలు అందరూ కూడా ఐక్యమత్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరించబడతాయని బీసీ సంక్షేమ సంఘం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు నామాల శంకర్, సీనియర్ నాయకులు బోయ రవిచంద్రలు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక ఎన్జీవో హోం కార్యాలయంలో బీసీల ఆత్మీయ సమావేశాన్ని చేనేత ప్రముఖులు గిర్రాజురవి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టు చీరలకు ధర్మవరం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని, అలాంటి చేనేత పరిశ్రమపై అన్ని వర్గాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అందరినీ కలుపుకొని సమిష్టిగా పోరాడి సమస్యలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. 50 ఏళ్ల క్రితం కాశెట్టి శ్రీనివాసులు, పళ్లెం వెంకటేశులు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడం జరిగిందని, ప్రస్తుతం తిరిగి ఒక బీసీ వ్యక్తి సత్య కుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ధర్మవరంలో ప్రజలు చేనేతలు ప్రశాంతతను కోరుకుంటున్నారని, దీన్ని అనుగుణంగా చేసుకొని ప్రస్తుత ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ కూడా ప్రశాంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గిర్రాజు రవి, పల్లపు రవీంద్ర, గోపాల్, బొట్టు కృష్ణ, పోతులయ్య, శ్రీనివాసులు, సదాశివానంద, జింకల రాజన్న, పల్లపు శివశంకర్, పూలకుంట్ల మహేష్, చీమల రామాంజి, సాయి, చంద్రమూరి, రమేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ అక్రమాలపై విచారణ

విశాలాంధ్ర-గోరంట్ల : మండలంలోని బూదిలి సెక్టార్‌లోని గంగాదేవి పల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌లో టీచర్ సరోజమ్మ బాలింతలకు, గర్భవతులకు, పిల్లల తల్లులకు, చిన్న పిల్లలకు అందించాల్సిన బియ్యం, బ్యాళ్లు, కోడిగుడ్లు, నూనె, సంపూర్ణ పోషణ కిట్లు, పోషకాహార పదార్థాలు వారికి అందించకుండా మగ్గి పెడుతూ చివరికి వాటిని అమ్ముకుని సొమ్ము చేసు కొంటుందని, అంతేకాకుండా విధులకు సక్రమం గా రావడంలేదని గ్రామస్తులు సూపర్ వైజర్ రజితకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సూపర్‌వైజర్ శుక్రవారం అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆయాలను మందలించగా వారు గ్రామస్తులు పిల్లలని సెంటర్‌కు పంపలేదని తెలిపారు. అందుకు గ్రామస్తులు అంగన్వాడీ సెంటర్ చెరువుకు అతిసమీపంలో ఉన్నదని, చెరువులో నీళ్లు ఉంటాయని ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు. ఊరి చివర ఉన్నందున మేము పిల్లలని పంపడం లేదని వారు తెలిపగా ఒకటో తేదీ లోపల సెంటర్ మార్చమని సూచించారు, అంగన్వాడీ టీచర్ సరోజమ్మ గోరంట్లలో కాపురం ఉంటూ వారానికి ఒక రోజు కూడా విధులకు రాదనీ గ్రామస్తులు తెలపగా ఆయా మాత్రం గ్రామంలోనే ఉన్నకాని అమెకు చెవిటి తనం వల్ల ఏమి చెప్పిన వినపడదని ఆమెకు చెప్పిన ఉపయోగం లేదని వారు తెలియజేశారు. టీచర్ సెంటర్‌కు రాదు పంపిణీ చేయదు ఆయాకి పంపిణీ చేయమని చెప్పదు కనుక గుడ్లు, బియ్యం, బ్యాల్లు, ఆయిల్ ప్యాకెట్స్, కిట్లు పాడాయి పోయి వాసన వస్తుందని, అలాగే అంగన్వాడి సెంటర్లో వంట చేసి మూడు నెలలు కావస్తుందని గ్యాస్ సిలిండర్ వాడబట్టి నాలుగు సంవత్సరాలు అయిందని ఒక్కరోజు కూడా వంట చేయదని తెలిపారు. ఒక్కోసారి ఆయా, టీచర్, పంపకాలలో ఘర్షణ పడుతుంటారని ఫిర్యాదు చేశారు. సూపర్వైజర్ రజిత కార్యకర్త సరోజమ్మ, ఆయా పుట్టమ్మలను ఇరువురిని విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో మెమోలు జారీ చేశామని సూపర్వైజర్ రజిత మీడియాకు తెలిపారు.

అంగరంగ వైభవంగా అక్కదేవతలు

ఎలవ గంపు ఊరేగింపు కార్యక్రమం

విశాలాంధ్ర-గోరంట్ల : గోరంట్ల మండలంలోని మలసముద్రం గ్రామంలో శుక్రవారం రవి, చక్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అక్కదేవతల యలవ గంప కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రతి ఇంటి నుంచి అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, పచ్చ సామాగ్రి ప్రత్యేక పూజలు భాగంగా శ్రీ అక్కదేవతల గిరిజన పూజలు అక్కదేవతల కొలువైన ఇంటి నుంచి పూర్వ వీధుల్లో ఎలవ గంప ఊరేగింపును ఉరుముల వాయిద్యాలతో నిర్వహించారు. అనంతరం శ్రీ అక్కదేవతల ప్రతిరూపంగా ఏడుగురు చిన్నారులకు ఒళ్ళు నింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అంద జేశారు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రైల్వే అండర్ బ్రిడ్జికి శాశ్వత పరిష్కారం చేస్తాం

- ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం: కొత్తపేట వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తానని ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. వర్షాల కారణంగా బ్రిడ్జి కిందకు నీరు చేరి, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఢిల్లీ పర్యటనలో ఉన్న తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై ఢిల్లీలో సంబంధిత శాఖ అధికారులతోనూ, రైల్వే శాఖ అధికారులతోనూ మాట్లాడానని త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ప్రస్తుతానికి అక్కడ చేరిన నీటిని తొలగించి శుభ్రం చేయాల్సిందిగా ధర్మవరం మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించడం జరిగిందన్నారు. ప్రజలు ఈ విషయం ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందన పట్ల పట్టణ ప్రజలు, ప్రముఖులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సేంద్రియ ఎరువులతోనే పంటలు పండించుకోవాలి...

- వ్యవసాయ అధికారి ముస్తఫా



విశాలాంధ్ర-ధర్మవరం: రైతులు సేంద్రియ ఎరువులతోనే పంటలు పండించుకుంటే అధిక దిగుబడి లభిస్తుందని వ్యవసాయ అధికారి ముస్తఫా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల నుంచి మండల పరిధిలోని 16 రైతు భరోసా కేంద్రాలలో అవసరమైన రైతులకు 3,300 క్వింటాల వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలలో కందులు కూడా లభ్యమవుతున్నాయని, ప్రత్యామ్నాయ పంటగా ఈ కందులను వేసుకోవచ్చు అని తెలిపారు. రసాయనిక ఎరువులను తగినంతగా మాత్రమే పంటకు వాడుకోవాలని తెలిపారు. గత సంవత్సరంలో మండలములో 12, 000 వేల ఎకరాల విస్తీర్ణంలో వేరుశనగ పంటను వేయడం జరిగిందని, సకాలంలో వర్షాలు రాకపోవడం వలన రైతులకు పంట దిగుబడి ఆశించినంతగా రాలేకపోవడం నష్టాలు పాలు కావడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా రైతు భరోసా కేంద్రాలలో పంట విషయంలో తగిన సలహాలు, సూచనలు కొరకు, అదేవిధంగా ఉద్యాన పంటలకు సహాయ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సంవత్సరం అనుకున్న విధంగా వర్షాలు పడ్డాయని, రైతులు పంట వేసేందుకు అన్నిపనులు ప్రారంభించుకొనే అవకాశం ఉందని తెలిపారు.

పోలీసు వాహనం బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడ్డ పోలీసులు



విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ డీఎస్పీ బాబి జాన్ సైదా శుక్రవారం పెనుకొండ నుంచి సోమందేపల్లిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో పని చూసుకొని తిరిగి పెనుకొండకు వస్తుండగా జాతీయ రహదారి పులేకమ్మ గుడి వద్ద పోలీసు వాహనం బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న డీఎస్పీకి, పోలీస్ మధు హోంగార్డు జాబికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి పంపించారు.

మారెమ్మ దేవాలయంలో

ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర-గోరంట్ల : గుమ్మయ్యగారిపల్లిలో వెలసిన శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ దేవి రాజుస్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవేరా హాస్పిటల్ సిబ్బంది పర్యవేక్షణలో శుక్రవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ సవేరా హాస్పిటల్ జనరల్ మేనేజర్ ప్రభాకర్, శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ తరఫున దేవిరాజు స్వామి శాలువా పూలమాలతో ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ ఉచిత గుండె వైద్య శిబిరంలో దాదాపు 50 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో మెరుగైన వైద్యం కోసం కిమ్స్ సవేరా హాస్పిటల్‌కి 10మందిని రెఫర్ చేశారు. ఉచిత గుండె వైద్య శిబిరానికి వచ్చిన వారికి పులేరు గ్రామానికి చెందిన రాజు, మంజుల, విశ్వనాథ్, నాగవేణి, యశోదమ్మ, సూర్యనారాయణ రామాంజ నమ్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ మారెమ్మ దేవి ఆలయ కమిటీ చైర్మన్ దేవి రాజు స్వామి ఆలయ కమిటీ సభ్యులు కిమ్స్ సవేరా హాస్పిటల్ జనరల్ మేనేజర్ ప్రభాకర్, డాక్టర్ సాహిత్ రెడ్డి, ఓబులేష్, ఏకాంత్ టుడి ఎకో టెక్ నాగరాజు సవేరా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సత్యకుమార్ గెలుపు సంబరాలు..



విశాలాంధ్ర-ధర్మవరం : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి సత్య కుమార్ యాదవ్ అత్యధిక మెజా ర్టీతో ధర్మవరం నియో జకవర్గ శాసనసభ్యుడిగా గెలుపు పొందడం పట్ల శుక్రవారం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జింక చంద్రశేఖర్, షాకే ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ వైసీపీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పడం జరిగిందని, సత్య కుమార్ నాయకత్వంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందు తుందని తెలిపారు. అత్యధిక మెజార్టీతో సత్య కుమార్ యాదవ్ను గెలిపించడం పట్ల అన్ని వర్గాల ప్రజలకు పేరుపేరునా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, చేనేత సెల్ రాష్ట్ర సభ్యులు గూండా పుల్లయ్య, యువమోర్చా జిల్లా కార్యదర్శి కార్తీక్, పుట్లూరు నరసింహులు, గట్టు నాగరాజు, నబిరసూల్, ధర్మవరం రూరల్, తాడిమర్రి మండల అధ్యక్షులు బక్సభస్థలం, పోతులయ్య, చంద్రమౌళి, శంకర చంద్రశేఖర్, పాల్తూరి నాగభూషణ, గంజి రాజా, చింతా మంజునాథ్, రాజకుమార్, నాగేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం ..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ వీధిలో గల ప్రధాన గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో 20 రోజులుగా శిక్షణా శిబిరాలను నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరాలు శుక్రవారంతో విజయవంతంగా ముగిశాయని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ముగింపు వేడుకలు పాఠకుల నడుమ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఎల్ఐసి ఏజెంట్ నాగరాజు, మురళి, ముకుంద మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేడు టెక్నాలజీ పెరిగిన ప్రకారం మంచి కొరకే వాటిని వాడుకోవాలని కుటుంబంలో ఉన్న పిల్లలకు సెల్‌ఫోన్‌లను దూరంగా ఉంచాలని తెలిపారు. సమయాన్ని వృధా చేయకుండా అనుకున్న లక్ష్యాన్ని ఛేదించే విధంగా విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. గ్రంథాలయంలో లభించే పలు రకాల పుస్తకాలు పై అవగాహన చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉంటారని తెలిపారు. అనంతరం వివిధ రకాల పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణ నాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆసుపత్రి రోగులకు సేవ మానవసేవ అవుతుంది

విశాలాంధ్ర-ధర్మవరం : ఆసుపత్రి రోగులకు సేవ మానవసేవ అవుతుందని శ్రీ సత్య సాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల 365 మంది రోగులకు, వారి సహాయకులకు వైద్యులు, సిస్టర్ల చేతులమీదుగా భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లు, గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సేవాదాతగా (విరాళాధాత) కీర్తిశేషులు దాసరి తులసమ్మ, వెంకటస్వామి వారి కుటుంబ సభ్యులు విరాళా సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవలు అనన్యమైనవని రోగులు తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 8, జూన్ 2024

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన

అధికారులకు అభినందనలు

జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ దక్షిణ రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన అధికారులకు శుక్రవారం జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ దక్షిణ భారత రాష్ట్రాల గౌరవ అధ్యక్షుడు వెంగమేష్ చౌదరి ముదిగుబ్బ మండలం లో ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పూర్తి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన కలెక్టర్, ఎస్పీ, సంబంధిత అధికారులకు అభినందనలు తెలిపారు. మానవ హక్కుల విష యంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామని, హ్యూమన్ రైట్స్ జాతీయస్థాయిలో విస్తృ తంగా పనిచేస్తోందని, హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తమ కమిటీ అక్కడ సంపూర్ణ మద్దతు ఇస్తూ అండగా నిలబడుతోందని, గ్రామస్థాయిలో ఎక్కడైనా హక్కులకు భంగం వాటిల్లితే తమ దృష్టికి తీసుకురావాలని న్యాయం జరిగే విధంగా పరిష్కార దిశగా తీసుకెళ్తామన్నారు.

ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎన్నికల్లో బీజేపీ గెలుపు పట్ల అంబరాన్నంటిన సంబరాలు

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నందు శనివారం భారతీయ జనతా యువమోర్చా సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి అధ్యక్షతన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి గౌడ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, వరుసగా మూడోసారి కేంద్రంలో మన గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుకు సర్వం సిద్ధం అయ్యింది. మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని, ఎన్డీఏ కూటమి నాయకుడిగా ఎన్నుకున్నారు. ఇది భారతదేశానికి ఒక శుభ సూచకమని, ప్రపంచంలో భారతదేశ స్థానానికి చేరేందుకు మార్గం సుగమం అవుతుందని, ఎప్పుడూ లేనివిధంగా వరుసగా మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మి గెలిపించినందుకు ప్రజలందరికీ ధన్యవాదాలని, ఆంధ్రప్రదేశ్లో గెలుపొందిన కూటమి అభ్యర్థులందరికీ పేరుపేరునా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం అంబేద్కర్ సర్కిల్లో నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం, కేక్ కటింగ్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అంజన్ రెడ్డి, గోవింద్ రెడ్డి, మండల అధ్యక్షులు నాగేష్, లేపాక్షి మండల అధ్యక్షుడు నరసింహమూర్తి, చిలుమత్తూరు మండల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలగోపాల్, ఉపాధ్యక్షుడు యర్రమంచి మారుతి, బీజేవైఎం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జనార్దన్, సురేష్, అరుణ్, రవిశంకర్, శివ, పట్టణ అధ్యక్షులు జయకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు దత్త, రమేష్, శ్రీనివాసులు, హనుమంతప్ప, నాగరాజు, ఛాలెంజ్ రాముడు,మూర్తి, రమణారెడ్డి, కిషోర్, ఆనంద్, జగప్ప, ప్రసాద్, శివప్ప, నాయకులు రవి, ప్రదీప్, రాజు, సూర్య, సతీష్, వినయ్, మంజు, శివకుమార్, నౌషాద్, దేవాంగం హరి, ఇంద్ర, వెంకీ, ముజ్జు, గణేష్, గోపాలప్ప, సాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సవితమ్మకు మంత్రి పదవి ఇవ్వాలి

కురుబ సంఘం నాయకుల తీర్మానం

విశాలాంధ్ర-పెనుకొండ : ఎమ్మెల్యే సవితమ్మకు రాష్ట్ర క్యాబినెట్లో మంత్రి పదవి ఇవ్వాలని కురుబ సంఘం నాయకులు టీడీపీ అధిష్టానాన్ని కోరారు. పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ కురుబ సంఘం నాయకులు కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాయలసీమలో తెలుగుదేశం పార్టీ 2 ఎంపీ సీట్లు కర్నూలు, హిందూపురం, పెనుకొండ ఎమ్మెల్యే సీటు కురుబ లకు కేటాయించినందుకు తెలుగుదేశం పార్టీ అధినేతచంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలుపుతూ ఇచ్చిన మూడు సీట్లలో అభ్యర్థులు విజయం సాధించడం శుభ పరిణామం అని వారు తెలిపారు అలాగే రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో 10 లక్షల మంది దాకా కురువ కులస్తులు తెలుగుదేశం పార్టీతోనే ఉన్నారని కావున మా కులంలో ఏకైక ఎమ్మెల్యే అభ్యర్థిగా ఒక మహిళ ఎమ్మెల్యేగా ఎన్నికైన సవితమ్మ కి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని కురుబ కులస్తులు ఎప్పుడు తెలుగుదేశం పార్టీతోనే ఉంటారని పార్టీ అభివృద్ధి చెందటానికి ఇది మంచి అవకాశం గా భావిస్తున్నామని అందువలన మంత్రివర్గంలో చోటు కల్పించి అవకాశం ఇయ్యాలని వారు విన్నవించి తీర్మానం చేశారు, ఎమ్మెల్యే సవితమ్మ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులతో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో కేసులు బనయించుకుని కార్యకర్తలకు అండగా ఉంటూ, ప్రతి కార్యకర్తకు భరోసా కల్పిస్తూ నేనున్నానంటూ మనోధైర్యంతో పార్టీని నడిపించిన వ్యక్తి పార్టీకి అండదండలు చేకూర్చిన వ్యక్తి ఎన్నో సేవా కార్యక్రమాలతో ఆమె ప్రజల మనసులలో స్థానం సంపాదించిన వ్యక్తిగా ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించారని కావున తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆమె యొక్క సేవలను వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు రామాంజనేయులు ఈశ్వర ప్రసాద్, రామకృష్ణ వెంకట్రాముడు ఆదినారాయణ , చిన్న పోతన, హరి, న0జప్ప, రవికుమార్, గోపాల్, రమణమ్మ,తదితరులు పాల్గొన్నారు.

కులాచారాలను కాపాడుకుందాం

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : కుల దైవాన్ని పూజిద్దాం,కుల గురువులను గౌరవిద్దాం, తోటి వారిని ఆదరిస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడుదామని సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారఖ్ గోరంట్ల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మండల, గ్రామ స్థాయి సంయోజక్ సభ్యులకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతి కులానికి ఓ ఉదాత్తమైన చరిత్ర, సామాజిక ధార్మిక ప్రయోజనం, సమున్నత స్థానం ఉందని, ప్రతి కులంలోను సామాజిక,ఆధ్యాత్మిక జాగృతి కోసం కృషి చేసిన ఆదర్శ పురుషులు, మానవతా మూర్తులు ఎందరో ఉన్నారని, స్వాతంత్ర్య సమరంలోను, ఆతర్వాత నవభారత నిర్మాణ ప్రక్రియలోను అన్ని కులాల వారి సమాన ప్రాతినిధ్యం, సమిష్టి కృషి ఉందని, సనాతన ధర్మానికి మాత్రమే స్వంతమైన ఈ మహోన్నత కుల వ్యవస్థ గొప్పతనాన్ని,ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ ఆవశ్యకతను అవగతం చేసుకుని, ఎవరికి వారు బలవంతులవుతూ.... జాతిని ధర్మాన్ని తద్వారా దేశాన్ని బలమైన శక్తిగా రూపొందించాలని పేర్కొన్నారు. మండల సంయోజక్ ప్రముఖ్ సభ్యులు నీలకంఠ రెడ్డి, విజయ సింహ మాట్లాడుతూ.....కుల దైవాన్ని పూజిద్దాం, కుల గురువులను గౌరవిద్దాం తోటి వారిని ఆదరిస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడుదామని, ఇంట్లో కులం, ఇంటి బయట మనమంతా బంధువులమని గ్రామ స్థాయిలో నినాదించాని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల విడుదల చేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల ప్రచార సంయోజక్ రిటైర్డ్ ఎంఈఓ ఎస్.నరసింహులు, మండల మహిళా కన్వీనర్ కుళ్ళాయమ్మ, సహాయకులు చిన్నమ్మ,గ్రామ సంయోజక్ కన్వీనర్లు సి.శివారెడ్డి, వెంకట రాముడు, అక్కులప్ప, వెంకట్రామిరెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సవితమ్మకు మంత్రి పదవి కేటాయించాలి...

విశాలాంధ్ర-సోమందేపల్లి: తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు ఐదు సంవత్సరాలుగా అండగా ఉన్న కురుబ కుల మహిళా నేత ఎమ్మెల్యే సవితమ్మకు మంత్రి పదవి కేటాయించాలని సోమందేపల్లి తెలుగుదేశం మండల నాయకులు టీడీపీ అధిష్టానాన్ని కోరారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశ మండల నాయకులు నీరుగంటి చంద్రశేఖర్, మాజీ జెడ్పిటిసి వెంకటరమణ, కన్వీనర్ సిద్ధి లింగప్ప, మాజీ సింగల్ విండో అధ్యక్షులు డివి ఆంజనేయులు, సర్పంచ్ నరసింహులు, టౌన్ కన్వీనర్ సూరి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా అధికార పార్టీ ముఖ్య నేతలు మంత్రులు శంకర్ నారాయణ, ఉషశ్రీ, తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేయాలని సవితమ్మ పైన అనేక అక్రమ కేసులు బనాయించినా ఆమె ఎవరికీ భయపడకుండా ధైర్యంగా తనపై ఉన్న కేసులను ఎదుర్కోవడమే కాకుండా గ్రామాలలో తెలుగుదేశం నాయకులపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ న్యాయ పోరాటం చేసి కార్యకర్తలను కాపాడుకున్నారని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ఉచిత బోజ సహాయం ఏర్పాటు చేయడం, అన్న క్యాంటీన్ ఏర్పాటుచేసి పేదలకు ఆహారాన్ని అందించటం, కష్టాలలో ఉన్న ప్రతి కుటుంబాన్ని తనవంతుగా ఆర్థిక సాయం చేయడం కరోనా కష్ట కాలంలో ఎన్నో కుటుంబాలను ఆదుకున్నారని చెప్పారు. ఇలాంటి ప్రజా సేవ చేసే ఈ మహిళా నేతకు తెలుగుదేశం అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు మంత్రి పదవి కేటాయించాలని కోరారు. మండలంలోని ఓటమి భరించలేని వైసీపీ నేతలు విజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న తెలుగుదేశం నాయకులు కార్యకర్తలపై కవ్వింపు చర్యకు పాల్పడి దాడులు చేస్తున్నారని రౌడీయిజం గుండాయిజం వైసిపి పార్టీ కి రెండు కళ్ళు లాంటివని మన తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణతో ఎదిగిన పార్టీ అని టీడీపీ నాయకులు సంయమనం పాటిస్తూ ఏదైనా ఘర్షణ ఏర్పడితే న్యాయపరంగా పోరాడాలని దాడికి దిగరాదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, రైతు సంఘ నాయకులు హరి కృష్ణ, బాబయ్య, లక్ష్మన్న, ఆనంద్, రమణ, రామంజి, శివశంకర్, కోతల ప్రసాద్, నాగేంద్ర, మురళి, లక్ష్మీనారాయణ, నరసింహులు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జెసి అస్మిత్‌రెడ్డి గెలుపుతో ముస్లిం మైనార్టీల సంబరాలు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా జేసీ అస్మిత్ రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు ముందుగా హజరత్ సికందర్ హాజీ వలి దర్గాలో ప్రత్యేక ప్రార్థన లు అనంతరం మండల కన్వీనర్ రుద్రమ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు, అదేవిధంగా రజక వీధిలో కూడా జేసీ అస్మిత్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో రజక వీధి వాసులు కూడా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారుఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, మైనార్టీ అధ్యక్షుడు సుభహాన్, టౌన్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ, మహమ్మద్ రఫీ, వెంకటేష్, రాముడు, చలపతి, విశ్వనాథ్ కేశవ సెల్ పాయింట్ చాంద్ భాషా,విజన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్, రహంతుల్లా,హాజీ మస్తాన్, మాయ కుంట్ల నారాయణస్వామి, రామచంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ

గోరంట్ల లో బీజేపీ సంబరాలు

విశాలాంధ్ర-గోరంట్ల: భారత ప్రధానిగా మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గోరంట్ల పట్టణంలో శుక్రవారం బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. గోరంట్ల లోని గాంధీ విగ్రహం ఎదుట భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ నాయకత్వంలో భరతమాత ముద్దుబిడ్డ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్డీఏ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నికై మూడవసారి భారత ప్రధానమంత్రిగా ఎన్నికైన సందర్భంగా గోరంట్ల మండల బిజెపి ఆధ్వర్యంలో బాణా సంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు, నరేంద్ర మోడీ నాయకత్వం వర్ధిల్లాలని బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మేదర శ్రీనివాసులు, శంకర్ రెడ్డి, పూల గంగాధర్, ముంతాజమ్మ, లక్ష్మీదేవి,బోయ లక్ష్మీనారాయణ, నాగరాజు యాదవ్, వెంకటాచలం, శంకర్, నరసింహులు, కాటేపల్లి నరేష్, కాచర్ల హరీష్, లక్ష్మీనరసు ,షబ్బీర్, కుర్ర ఆంజనేయులు, లక్ష్మీపతి చైతన్య నున్న అరుణ్ గుంటుపల్లి చంద్ర మేరెడ్డిపల్లి వెంకటేష్ కళ్యాణి కుమార్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న యూటీఎఫ్ జిల్లా సమావేశం

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులోనే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మధ్యంతర జిల్లా కౌన్సిల్ సమావేశం 9వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించడం జరుగుతుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జై చంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయుల హక్కుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాబు, గీతామాలక్ష్మి, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ మారుతి, జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివశంకర్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ గెలుపుపై సంబరాలు

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గల ఎన్టీఆర్ విగ్రహం నందు టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో ముచ్చటగా మూడోసారి నందమూరి బాలకృష్ణ గెలుపొందడంతో శుక్రవారం మండలంలోని నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని దివంగత నేత ఎన్టీ రామారావు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలతో అలంకరించి, నివాళి అర్పించి జై చంద్రబాబు, జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు, అనంతరం కేక్ కట్ చేశారు. పుర వీధుల్లో బాణ సంచా పేల్చి స్నేహ పూరకముగా మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు, అదేవిధంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అంజినప్ప, గంగాధర్, శ్రీదేవి, నందీష్, అశ్వత్ తప్ప, నాగరాజు యాదవ్, లక్ష్మి నారాయణ యాదవ్, తిప్పారెడ్డి, రఘు నాథ్ రెడ్డి, రఫిక్, ఖలీమ్, శ్రీనివాసులు, నాగరాజు, ఆదిమూర్తి, బంగారు చలపతి, పరిటాల వెంకటేష్, మల్లికార్జున, హోటల్ చంద్ర, సూరి, తదితరులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సవితమ్మకు మంత్రి పదవి రావాలని ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ శాసన సభ్యురాలుగా అఖండ విజయం సాధించిన సవితమ్మకి నూతన ప్రభుత్వంలో మంత్రిగా అవకాశం రావాలని, పెను కొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం పెనుకొండలో కోర్టు ఆవరణలో గల కాళీమాత దేవాలయంలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కన్నా స్వామి రమణమ్మ, హోటల్ మీనాక్షమ్మ, తోట గేరి శీన, రవికుమార్, వెంకట్ రాముడు, నరేంద్ర, రామాంజనేయులు, శివ, చంద్ర పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు సంబరాలు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ మండల అధ్యక్షుడు మధుసూదన ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ సర్కిల్ నందు పెనుకొండ పట్టణంలో హిందూ ధర్మ రక్షకుడు, అపజయం ఎరుగని భారత మాత ముద్దు బిడ్డ ఎన్డీఏ నాయకుడిగా ఏకగ్రవంగా ఎన్నికై ముచ్చటగా మూడోసారి భారత దేశం ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న దామోదర దస్ నరేంద్ర మోడీ ఎన్నికైన సందర్భంగా బాణ సంచే కాల్చి , మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎనుముల రామకృష్ణ, అంగడి రామంజీ నేయులు, జయరాం యాదవ్,హనుమంతు యాదవ్. అసెంబ్లీ కో కన్వీనర్ రవీ, మహిళా నాయకురాలు సుభద్రమ్మ, నారాయణ నాయక్, సూర్యనారాయణ, గోవిందు, మురళీ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కే జయరాం, మాజీ సర్పంచ్ హరినాథ్ చౌదరి తెలిపారు. కొత్త చెరువులోనే శాఖ గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. గ్రంథాలయాల్లోనే పుస్తకాలను చదివి విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్ ,పాఠకులు కిష్టప్ప, శంకరప్ప, రామాచారి, శ్రీరాములు, నరసింహులు, అటెండర్ మునీరు, తదితరులు పాల్గొన్నారు.

16న అయ్యప్ప ఆలయంలో అక్షరాభ్యాసం

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: మండల కేంద్రానికి సమీపంలో ఎం.కొత్తపల్లి బంగారు బండపై వెలసిన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయంలో ఈనెల(జూన్) 16వతేది ఆదివారం అక్షరాభ్యాసం శుభకార్యం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు.మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం పరిపాలనాధికారి పూల రెడ్డప్ప సమక్షంలో అక్షరాభ్యాసం కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు మాట్లాడుతూ.... 5 వయసు నుండి పాఠశాల చేర్పించే చిన్నారులకు తొలి అక్షరం - జ్ఞానామృతం నినాదంతో కదిరి జోగి శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కోడూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పురోహితులు పంచరత్న సురేష్ శర్మ వారిచే అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొంటూ.... అక్షరాభ్యాసం శుభకార్యంలో పాల్గొనే వారు ఈనెల 12వతేది లోపు చిన్నారుల పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. అక్షరాభ్యాసం గావించాలనే తల్లిదండ్రులు 9885578756, 9908342433 నెంబర్లను సంప్రదించి చిన్నారుల పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.16న ఆదివారం ఉదయం 7:30 నుండి 10:30 వరకు అక్షరాభ్యాసం,చిన్నారులకు పలక, బలపం అందించిన అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం తదితర సౌకర్యాలు భక్తులకు కల్పిస్తామని ఆయన తెలిపారు.మండల ధర్మప్రచార, అధ్యాత్మిక గ్రామ వికాస్ ప్రముఖ్ చంద్రశేఖర్,రమణ నాయక్,మల్లెల రమేష్,నర్సింహులు తదితరులు కరపత్రాలు అందించి, కార్యక్రమాన్ని శుభప్రదం

11న మండల సమావేశం

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువు ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 11వ తేదీ మండల సర్వసభ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిం చడం జరుగుతుందని ఎంపీడీవో సిద్ధారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ గాయత్రి అధ్యక్షత వహిస్తారన్నారు. కావున మండలంలోని వివిధ సమస్యలపైన చర్చించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థి హేమంత్

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని హాలికుంట గ్రామానికి చెందిన హేమంత్ ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్షిప్ కు రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపిక అయ్యాడు ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటాడు. పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి హేమంత్ 106 మార్కులు సాధించి ఈ స్కాలర్షిప్ కు ఎంపికయ్యాడు హేమంత్ కు నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి స్కాలర్షిప్ మంజూరు అవుతుందని జాతీయస్థాయి ఎంపిక పరీక్షకు పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఎంపిక అయ్యేలా చూశారు.ప్రతిభ చాటిన విద్యార్థి హేమంత్ ను ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మహాదేవప్ప,ఉపాధ్యాయులుశ్రీనివాస్ రెడ్డి,గంగప్ప తదితరులు అభినందించారు. హేమంత్ స్ఫూర్తితో ఈ విద్యా సంవత్సరంలో మరి కొంతమంది విద్యార్థులు ఎంపిక అయ్యేలా చూస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతి శిబిరం

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక గ్రంథాలయ శాఖలో నిర్వహించన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మరియు గ్రంథాలయ కార్యదర్శి గారి ఆదేశాల మేరకు స్థానిక గ్రంథాలయ శాఖ ఇంచార్జ్ అధికారి ప్రతాప్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మురళి, ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ హెడ్ మాస్టర్ నరసింహమూర్తి, అగళి గ్రంథాలయ శాఖ ఇంచార్జ్ అధికారి బొజ్జేనాయక్ హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని 17-05-2024నుంచి 07-06-2024వరకు దాదాపు 24రోజులు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలు చాలా విలువైనవని గ్రంథాలయంలో పిల్లలకు కావలసిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం వలన పిల్లల జ్ఞాపకశక్తి పెరుగుతుందని, విద్యార్థులు ప్రతినిత్యం గ్రంథాలయంకు పోయే అలవాటు అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వేసవి శిబిరంలో మంచి విజ్ఞానాన్ని సృజనాత్మకతను పెంపొందించు కోవాలని తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వీపర్ ఆర్.గోపాల్ పాల్గొన్నారు.